జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 85 7-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06









### నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది: సీవీ ఆనంద్

- తల్లిని కలిసి ఆశీస్సులు తీసుకున్న తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్
- గతంలో తన తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని వెల్లడి
- కొడుకును డీజీపీగా చూడాలన్న కోరికే ఆమెను కాపాడిందని భావోద్వేగం
- ప్రస్తుతం ఆమె కోలుకున్నారని, ఇద్దరం సంతోషంగా ఉన్నామని వెల్లడి



### మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం.. తెలంగాణలో బోటింగ్‌పై కఠిన నిబంధనలు

- మధ్యప్రదేశ్ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణలో బోటింగ్ భద్రతపై ఆంక్షలు
- రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాలకు పర్యాటక అభివృద్ధి సంస్థ కొత్త ఆదేశాలు



### హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్... 700 మందికి పైగా దొరికారు!

- హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో వారాంతపు స్పెషల్ డ్రైవ్
- మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 700 మందికి పైగా పట్టివేత
- హైదరాబాద్‌లో 445, సైబరాబాద్‌లో 283 మందిపై కేసులు
- పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసుల వెల్లడి
- తాగి ప్రమాదాలు చేస్తే కఠిన చర్యలు



## భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం.. విజయవంతంగా నింగిలోకి 'మిషన్ దృష్టి'

- బెంగళూరు స్టార్టప్ గెలాక్సీఐ స్పేస్ ది 'మిషన్ దృష్టి' శాటిలైట్ విజయవంతం
- స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగం
- దేశంలోనే ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌గా రికార్డు
- ఇది భారత యువత ఆవిష్కరణల పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనమన్న ప్రధాని మోదీ
- ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ టెక్నాలజీ కలిగిన శాటిలైట్‌గా గుర్తింపు

భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం

(మిగతా 2వ పేజీలో)

# అమరావతి చంద్రబాబుకు బంగారు బాతు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

- వైసీపీని గొడ్డలి పార్టీ అనడంపై చంద్రబాబుపై కాకాణి ఫైర్
- చంద్రబాబు ఒక గడ్డపారలా ప్రజాధనాన్ని తవ్వుతున్నారని విమర్శ
- అమరావతి నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపణ
- చదరపు అడుగుకు రూ. 20,489 చెల్లించడంపై అభ్యంతరం
- ఎన్నికల్లో ప్రజలు వైసీపీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేసిన కాకాణి

వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. చంద్రబాబే ఒక గడ్డపారలా మారి ప్రభుత్వ ఖజానాను, ప్రజా సంక్షేమాన్ని తవ్వి తీస్తున్నారని వైసీపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, టీడీపీ నేతలు వైసీపీని హత్యారాజకీయాలు చేసే గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తున్నారని, కానీ వాస్తవానికి చంద్రబాబే ఒక గడ్డపారకు చిహ్నమని కాకాణి విమర్శించారు. అమరావతి ప్రాజెక్టు చంద్రబాబుకు, ఆయన బృందానికి ఒక బంగారు బాతుగా మారిందని ఆరోపించారు. ఒకవైపు పెంచిన కాంట్రాక్టుల ద్వారా ప్రజాధనాన్ని దోచుకుంటూ, మరోవైపు విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువతను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.





# 4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికలు: నేడు కౌంటింగ్... బెంగాల్, తమిళనాడుపైనే అందరి దృష్టి

- బెంగాల్, తమిళనాడు సహా ఐదు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం
- ఎగ్జిట్ పోల్స్‌లో బెంగాల్‌లో బీజేపీ, కేరళలో యూడీఎఫ్‌కు మొగ్గు, హోరాహోరీ అంచనాలు
- తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ టీవీకే రాకతో మారిన రాజకీయ సమీకరణాలు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద కనీవినీ ఎరుగని రీతిలో మూడంచెల భద్రతా వ్యవస్థ
- బెంగాల్‌లోని ఫాల్టాలో రీపోలింగ్ కారణంగా 293 స్థానాలకే ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన 4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సమయం ఆసన్నమైంది. పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేడు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొత్తం 823 అసెంబ్లీ స్థానాల భవితవ్యాన్ని తేల్చే ఈ లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఏప్రిల్ నెలలో పలు దశల్లో ఈ రాష్ట్రాల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఐదు రాష్ట్రాల్లో అందరి దృష్టి

(మిగతా 2వ పేజీలో)



## ఐదు నిమిషాల్లో దోపిడీ.. కరీంనగర్‌లో కాల్పుల కలకలం

- జ్యువెలరీ షాపులో తుపాకులతో బీభత్సం సృష్టించిన దుండగులు
- సిబ్బందిని మోకాళ్లపై కూర్చోబెట్టి బంగారం దోచుకెళ్లిన ముఠా
- రూ.2 కోట్లకు పైగా విలువైన కేజీన్నర బంగారం అపహరణ
- ప్రతిఘటించిన ఉద్యోగులపై కాల్పులు.. నలుగురికి గాయాలు
- బండి సంజయ్ కార్యాలయానికి సమీపంలోనే ఘటనతో కలకలం
- మహారాష్ట్రకు చెందిన పాత నేరస్తుల ముఠాపై పోలీసుల అనుమానం

కరీంనగర్: కరీంనగర్ నగరంలో ఆదివారం ఉదయం సినీ ఫక్కీలో జరిగిన జ్యువెలరీ దోపిడీ కలకలం రేపింది. తుపాకులతో వచ్చిన ఐదుగురు దుండగులు జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెలరీస్‌లోకి చొరబడి సిబ్బందిని బెదిరించి భారీ మొత్తంలో బంగారం దోచుకెళ్లారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉద్యోగులపై కాల్పులకు తెగబడటంతో నలుగురు గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు కస్టమర్ల మాదిరిగా షాపులోకి ప్రవేశించి

(మిగతా 2వ పేజీలో)

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కారుకు కేటీఆర్ సవాల్

- 'జీఓ 7తో 14 లక్షల విద్యార్థుల భవిష్యత్తుపై దెబ్బ' అంటూ మండిపాటు
- పథకాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- చీకటి జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- రూ.10 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని హెచ్చరిక
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులతో ఉద్యమానికి సిద్ధమని స్పష్టం



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్--7పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసి, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని

(మిగతా 2వ పేజీలో)



## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం: రఘురామ

- పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణం
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా భూమిపూజ
- గత వివాదాల నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆలయ నిర్మాణం పూర్తి చేస్తా: రఘురామ
- కృష్ణశిలతో 800 ఏళ్లు నిలిచేలా ఆలయాన్ని నిర్మిస్తామని వెల్లడి

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో కొంతకాలంగా వివాదాలకు కేంద్ర బిందువైన రామాలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం శంకుస్థాపన జరిగింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య, వేలాది మంది భక్తుల సమక్షంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఆయన అర్ధాంగి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7:14 గంటలకు నిర్ణయించిన ముహూర్తానికి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా

(మిగతా 2వ పేజీలో)

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## 4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం

# అసెంబ్లీ ఎన్నికలు: నేడు కౌంటింగ్...

పశ్చిమ బెంగాల్, తమిళనాడుపైనే కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నడిచింది. టీఎంసీ 200కు పైగా సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, చాలా ఎగ్జిట్ పోల్స్ బీజేపీ విజయం సాధించే అవకాశం ఉందని అంచనా వేశాయి. మరోవైపు, తమిళనాడులో అధికార డీఎంకే కూటమి మరోసారి అధికారం నిలబెట్టుకోవాలని చూస్తుండగా, నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) రంగ ప్రవేశంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. కొన్ని పోల్స్ టీవీకే ఆధిక్యం కనబరుస్తుందని అంచనా వేయడం గమనార్హం. ఇక కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్‌ను కాదని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికారం దక్కవచ్చని పోల్స్ చెబుతున్నాయి. అసోంలో హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని బీజేపీ కూటమి సునాయాసంగా అధికారాన్ని నిలబెట్టుకుంటుందని, పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమికే విజయావకాశాలున్నాయని అంచనాలు వెలువడ్డాయి.

### తమిళనాడులో భారీ ఏర్పాట్లు

తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 62 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, 8:30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. ఈ ప్రక్రియ కోసం సుమారు 1.25 లక్షల మంది సిబ్బందిని, లక్ష మంది పోలీసులను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బయటి వలయంలో స్థానిక పోలీసులు, గేట్ల వద్ద రాష్ట్ర సాయుధ పోలీసులు, కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర సాయుధ పోలీసు బలగాలు పహారా కాయనున్నాయి. తొలిసారిగా, క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు వ్యవస్థ ద్వారా మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.




### పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక చర్యలు

పశ్చిమ బెంగాల్‌లోనూ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 77 కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. అయితే, ఫాల్టా నియోజకవర్గంలో మే 21న రీపోలింగ్ ప్రకటించినందున, సోమవారం 294 స్థానాలకు గాను 293 స్థానాలకే ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఫాల్టా ఫలితాలు మే 24న వెలువడనున్నాయి. బెంగాల్‌లో కూడా మూడంచెల భద్రతను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ రూమ్‌లలోకి కేవలం కేంద్ర బలగాలను, బయట రాష్ట్ర, కేంద్ర బలగాలను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను పూర్తిగా నిషేధించారు. 2021 ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకుని, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రాష్ట్రంలో 700 కంపెనీల కేంద్ర బలగాలను కొనసాగించాలని ఈసీ నిర్ణయించింది. మొత్తం మీద, సోమవారం ఉదయం లెక్కింపు ప్రారంభమై, సాయంత్రానికి ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్... 700 మందికి పైగా దొరికారు!

**హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో వారాంతపు స్పెషల్ డ్రైవ్**

**మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 700 మందికి పైగా పట్టివేత**

**హైదరాబాద్‌లో 445, సైబరాబాద్‌లో 283 మందిపై కేసులు**

**పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసుల వెల్లడి**

**తాగి ప్రమాదాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్లలో కలిపి మొత్తం 728 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 445 మందిని పట్టుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ వాహనదారులు, 48 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు. మరోవైపు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 283 మంది పట్టుబడ్డారు. వీరిలో 227 మంది టూ-వీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీ-వీలర్, 8 మంది భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ సెక్షన్ ప్రకారం గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తామని, ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం..

# తెలంగాణలో బోటింగ్‌పై కఠిన నిబంధనలు

**మధ్యప్రదేశ్ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణలో బోటింగ్ భద్రతపై ఆంక్షలు**

**రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాలకు పర్యాటక అభివృద్ధి సంస్థ కొత్త ఆదేశాలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే యూనిట్ మేనేజర్లపై వేటు తప్పదని హెచ్చరిక**

**ఓవర్ లోడింగ్, లైఫ్ జాకెట్ల విషయంలో రాజీ లేదని స్పష్టం చేసిన ప్రభుత్వం**

**ప్రతికూల వాతావరణంలో బోటింగ్ సర్వీసులు నిలిపివేయాలని ఉత్తర్వులు**




మధ్యప్రదేశ్‌లోని బార్గి రిజర్వాయర్‌లో ఇటీవల జరిగిన ఘోర పడవ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నందున, బోటింగ్ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఏ చిన్న పొరపాటు జరిగినా సంబంధిత యూనిట్ మేనేజర్లు, ఇన్‌ఛార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారాంతాలు, సెలవు దినాలు, పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అధికారులు తప్పనిసరిగా బోటింగ్ యూనిట్ల వద్ద భౌతికంగా హాజరు కావాలని ఆదేశించింది. బోట్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం (ఓవర్ లోడింగ్), ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించకపోవడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్‌తో సహా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పుడు బోటింగ్ సర్వీసులను తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి బోటింగ్ యూనిట్‌లో ప్రథమ చికిత్స కిట్లు, రెస్క్యూ పరికరాలు, అత్యవసర ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ కొత్త మార్గదర్శకాలను జారీ చేశామని అధికారులు తెలిపారు.

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం: రఘురామ



రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కొందరు కోర్టుకు వెళ్లారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కృష్ణశిలతో సుమారు 800 ఏళ్లు చెక్కుచెదరని విధంగా ఆలయాన్ని నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన సోషల్ మీడియా ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గతంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ ఆలయ నిర్మాణం విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగడం, ఘర్షణలు చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ అంశం హైకోర్టు వరకు వెళ్లగా, ప్రభుత్వ అనుమతులతోనే పనులు చేపట్టాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీగా పోలీసులను మోహరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కారుకు కేటీఆర్ సవాల్

ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. విద్యను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం దానిని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించిన ఆయన.. కేసీఆర్ హయాంలోనే కాదు, ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కూలదోస్తోందని విమర్శించారు. పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అండగా నిలిచిన ఈ పథకాన్ని రద్దు చేయాలన్న ఆలోచనే అన్యాయమని పేర్కొన్నారు. జీఓ-7 ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను పాతరేయాలనే కుటిల ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. గత 30 నెలలుగా ఫీజు బకాయిలు విడుదల చేయని ప్రభుత్వం.. ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.10 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చీకటి జీఓను ఉపసంహరించుకుని విద్యార్థులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులతో భారీ ఉద్యమానికి దిగుతామని హెచ్చరించిన కేటీఆర్, విద్యార్థి లోకం ఆగ్రహిస్తే ప్రభుత్వం రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు.



## గాయని శోభారాణికి 'బుద్ధ పూర్ణిమ' పురస్కారం

**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రానికి చెందిన ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణికి ప్రతిష్టాత్మక 'దత్త సేవ రథం బుద్ధ పూర్ణిమ' అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ మెయిన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఆర్. ఫౌండేషన్ అధినేత శ్రవణాచార్యులు మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించడంలో తమ సంస్థ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం శోభారాణిని జ్ఞాపిక, శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌలే జగన్నాథం, పబ్బోజు సాయిబాబా చార్యులు, లత, లక్ష్మి, ప్రశాంతి, శకుంతల, లక్ష్మణ్, సతీష్, పట్నాల సావిత్రి, మల్లెపూల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై గాయనిని ప్రశంసించారు.

## అమరావతి చంద్రబాబుకు బంగారు బాతు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

అమరావతిలో చదరపు అడుగు నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 20,489 చెల్లిస్తున్నారని, సాధారణంగా దీనికి రూ. 4,500 మాత్రమే ఖర్చవుతుందని కాకాణి అన్నారు. తెలంగాణ సచివాలయం, పార్లమెంట్ భవనం నిర్మాణ ఖర్చులు కూడా ఇంతకంటే చాలా తక్కువని గుర్తుచేశారు. గతంలో తనకు అనుకూలంగా ఉన్నవారికే మళ్లీ కాంట్రాక్టులు కట్టబెట్టి, రేట్లు పెంచి వ్యవస్థీకృతంగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని, పదవిని లాక్కోవడంతో మొదలైన చంద్రబాబు తీరు మారలేదని, అవినీతి, కుట్రలు ఆయన నైజమని విమర్శించారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు వల్ల ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి సంపూర్ణ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకాణి ధీమా వ్యక్తం చేశారు.

## భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం.. విజయవంతంగా నింగిలోకి 'మిషన్ దృష్టి'

ఆవిష్కృతమైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ 'గెలాక్సీఐ స్పేస్' అభివృద్ధి చేసిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. దేశీయ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో ఇది ఒక కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సుమారు 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి', ఇప్పటివరకు ఒక భారతీయ ప్రైవేట్ సంస్థ నిర్మించిన అతిపెద్ద ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' టెక్నాలజీ కలిగిన శాటిలైట్ కావడం విశేషం. ఈ విజయంతో గెలాక్సీఐ స్పేస్, అంతరిక్ష సాంకేతికతలో సరికొత్త హద్దులను చెరిపేస్తున్న స్టార్టప్‌ల సరసన నిలిచింది. ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. గెలాక్సీఐ వ్యవస్థాపకులు, యావత్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'లో స్పందిస్తూ, "మన అంతరిక్ష ప్రయాణంలో గెలాక్సీఐ వారి మిషన్ దృష్టి ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తుంది. ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ శాటిలైట్, భారతదేశంలో ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించడం మన యువత ఆవిష్కరణల పట్ల, దేశ నిర్మాణం పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## ఐదు నిమిషాల్లో దోపిడీ.. కరీంనగర్‌లో కాల్పుల కలకలం


బంగారు గొలుసులు చూపించాలని కోరారు. కొద్ది సేపటికే మరో ముగ్గురు లోపలికి రావడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. ఇన్‌చార్జి నగలు చూపిస్తుండగానే దుండగులు ఒక్కసారిగా తుపాకులు బయటకు తీసి బెదిరింపులకు దిగారు. తెలుగు, హిందీ భాషల్లో అరుస్తూ సిబ్బందిని మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు కట్టేశారు. తలలకు తుపాకులు గురిపెట్టి షోరూమ్‌లోని బంగారం, ఆభరణాలు సంచుల్లో నింపుకున్నారు. ఈ సమయంలో షాపు ఇన్‌చార్జి ముస్తాక్‌తో పాటు సిబ్బంది మధుకర్, రాజేశ్, కమలాసన్ ధైర్యంగా ప్రతిఘటించారు. దీంతో దుండగులు కాల్పులు జరిపారు. ముస్తాక్ తలకు బుల్లెట్ తగలగా, మధుకర్‌కు పొట్ట భాగంలో తీవ్ర గాయం అయింది. మరో ఇద్దరికి భుజాల వద్ద తూటా గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దోపిడీ అనంతరం దుండగులు అపాచీ, పల్సర్ బైక్‌లపై శాతవాహన యూనివర్సిటీ, మల్కాపూర్, చింతకుంట మార్గంగా సిరిసిల్ల వైపు పారిపోయారు. మొత్తం ఘటన కేవలం ఐదు నిమిషాల్లోనే ముగిసినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలంలో నుంచి బుల్లెట్ షెల్స్, ఒక మేగజైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది: సీవీ ఆనంద్ భావోద్వేగం

తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు. కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# చేనేత రుణమాఫీలో కమీషన్ల కక్కుర్తి!

- రాజపేట మండలంలో అధికారుల చేతివాటం
- చెక్కులు ఇవ్వాలంటే దళారులకు ముడుపులు సమర్పించుకోవాల్సిందే..
- ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల వసూలు
- జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని లబ్ధిదారుల విజ్ఞప్తి




తొలివెలుగు, రాజపేట : అప్పుల ఊబిలో కూరుకుపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. చేనేత, జౌళి శాఖ అధికారుల కక్కుర్తికి నిరుపేద నేతన్నలు బలవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ఫలాలను అందుకోవాలంటే.. అధికారులకు ముడుపులు చెల్లించక తప్పని దుస్థితి నెలకొంది. రాజపేట మండలంలో రుణమాఫీ చెక్కుల పంపిణీలో చోటుచేసుకున్న అవకతవకలు, దళారుల ప్రమేయం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు: 2017 నుంచి 2024 మార్చి 31 వరకు లక్ష రూపాయల లోపు రుణాలున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీని వర్తింపజేసింది. ఈ పథకం కింద రాజపేట మండలంలోని రఘునాథపురం, చల్లూరు, బొందుగుల, సోమారం, రేణికుంట, దూది వెంకటాపురం, బేగంపేట, రాజపేట గ్రామాలకు చెందిన సుమారు 150 మందికి పైగా కార్మికులు లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. అయితే, మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేయాల్సిన అధికారులు.. ఉద్దేశపూర్వకంగానే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిప్పించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**దళారుల ఎంట్రీ.. ముడుపుల వసూళ్లు:**

లబ్ధిదారుల నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న కొందరు అధికారులు, గ్రామాల వారీగా తమకంటూ ప్రత్యేకంగా దళారులను (మధ్యవర్తులను) ఏర్పాటు చేసుకున్నారు. వీరు రంగంలోకి దిగి, ఒక్కో లబ్ధిదారుడి నుంచి కచ్చితంగా రూ. 5000 ఇస్తేనే చేతికి చెక్కు అందుతుందని హుకుం జారీ చేశారు. అప్పులు మాఫీ అవుతాయన్న ఆశతో కొందరు, అధికారుల బెదిరింపులకు భయపడి మరికొందరు నేతన్నలు అప్పులు చేసి మరీ మధ్యవర్తులకు పర్సంటేజీలు సమర్పించుకున్నారు. ఆదివారం పలు గ్రామాల లబ్ధిదారులు ఈ విషయమై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నా పై అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు.



# ఏసీ గదుల్లో సమీక్షలు వద్దు.. కళ్లాల్లో రైతుల కష్టాలు చూడండి!

**మొద్దునిద్ర వీడి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి**

**రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ డిమాండ్**

**కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్.. అన్నదాతల ఆగ్రహం**

**తొలివెలుగు, రాజపేట :** క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుంటే, ప్రభుత్వం ఏసీ గదుల్లో సమీక్షలు చేస్తూ కాలయాపన చేస్తోందని రాజపేట మండల రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రోజుల తరబడి ధాన్యం గుట్టలుగా ఉన్నా, కొనుగోలు వేగం పెరగకపోవడంపై ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "ధాన్యం కేంద్రాలు తెరిచి రోజులు గడుస్తున్నా, కాంటాలు వేయడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. రైతులు రోడ్లపై, కొనుగోలు కేంద్రాల్లో ఎండకు ఎండి, వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలు అన్నదాత గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, అధికారులను క్షేత్రస్థాయికి పంపాలి" అని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొనుగోలు ప్రక్రియ ముగియడానికి మరో రెండు నెలలు పడుతుందని, చివరి గింజ కొనేవరకు రైతుల పక్షాన పోరాడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తుంగ అక్షయ్ కుమార్, బొడ్డుల వెంకటేశం, కటకం చిన్న వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతు వేదికల్లో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'

**99 రోజుల కార్యాచరణలో భాగంగా వ్యవసాయ శాఖ సదస్సులు**

**అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలి: మండల వ్యవసాయ అధికారి నాగరాజు**



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం చౌటుప్పల్ మండలంలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 9:00 గంటల నుంచి మండల పరిధిలోని 9 రైతు వేదికల్లో ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఎం. నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను రైతులకు చేరువ చేయడం, వ్యవసాయ రంగంలో సాధించాల్సిన ప్రగతిపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్, మార్కెట్ కమిటీ, పంచాయతీ రాజ్ శాఖల ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పాల్గొనాలని సూచించారు. రైతులు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ప్రగతి ప్రణాళిక సదస్సులను విజయవంతం చేయాలని ఏవో నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# క్వింటాకు 3 కిలోల కోత.. రైతన్నపై మిల్లుల 'దోపిడీ'!

**తేమ పేరుతో మోసగిస్తున్నారంటూ బీజేపీ కిసాన్ మోర్చా ధర్నా**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** తేమ పేరుతో రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతులను నిలువునా దోచుకుంటున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం పోచంపల్లి కేంద్రంలోని నేతాజీ చౌరస్తా వద్ద మండల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలో మిల్లుల దౌర్జన్యం మితిమీరిపోయిందని, ఏ-గ్రేడ్ ధాన్యాన్ని కావాలనే బి-గ్రేడ్‌గా పరిగణిస్తూ తక్కువ ధర కడుతున్నారని విమర్శించారు. క్వింటాకు రెండు నుండి మూడు కిలోల వరకు తరుగు పేరిట అదనంగా తీసుకుంటున్నారని, దీనిపై అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి 25 రోజులవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు సురకంటి భూపాల్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షుడు డబ్బికారు సాహెహ్, మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, పల్లె కాడి బసవయ్య, నాయకులు మణికంఠ, చంద్రవాసు తదితరులు పాల్గొన్నారు.





# కుమ్మర సంఘం మండల కమిటీ ఏకగ్రీవం

**అధ్యక్షుడిగా వంగూరి పెంటయ్య ఎన్నిక**

**హాజరైన రాష్ట్ర, జిల్లా నేతలు**



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** మండల కుమ్మర శాలివాహన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశ్వర్లు, రాష్ట్ర వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు గుండాల గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా వంగూరి పెంటయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా చిలువేరు బాల నరసింహ, కోశాధికారిగా చిలువేరు నరసింహ, ఉపాధ్యక్షులుగా గంగాధరి లక్ష్మణ్ రాజు, మర్రిపాల రమేష్, కొల్లూరు మహేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. కుమ్మర కులస్తుల హక్కుల సాధన కోసం నూతన కమిటీ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోచంపల్లి కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు వంగూరి సైదులు, ప్రధాన కార్యదర్శి వంగూరి పాండు, కోశాధికారి వంగూరి శివశంకర్, సహాయ కార్యదర్శి వంగూరి శేఖర్, గంగాధరి మురళికృష్ణ, వంగూరి దశరథ, వంగూరి శ్రీశైలం, కిష్టయ్య, రాములు, వంగూరి అంజయ్య, వంగూరి శంకరయ్య, వంగూరి బాలరాజు, వంగూరి బాలకృష్ణ, రాజ్ కుమార్, వంగూరి భాను, వంగూరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమకు దక్కిన సముచిత గౌరవం

**విద్యుత్ ఆర్టిజన్ల పక్షపాతి ఇంజ మహేశ్‌కు 'శ్రమశక్తి' అవార్డు**

**15 ఏళ్ల నిరంతర శ్రమ, అంకితభావానికి దక్కిన గుర్తింపు**

**కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారం**

**ఆపరేటర్ స్థాయి నుంచి జేపీసీ చైర్మన్‌గా ఎదిగిన వైనం**





**తొలివెలుగు, రాజపేట :** ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు.. మరోవైపు తోటి కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ పదిహేనేళ్లుగా విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన ఆలేరు నియోజకవర్గం రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ మహేష్‌కు ప్రతిష్టాత్మక 'శ్రమశక్తి' అవార్డు దక్కింది. మే 1వ తేదీన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, యూనియన్ నాయకత్వం ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశాయి.

**అంచెలంచెలుగా ఎదుగుదల:**

లక్ష్మి, నరసయ్య దంపతులకు జన్మించిన మహేష్ (జనవరి 09, 1988) ఐటీఐ, బీకాం పూర్తి చేసి, 2011 జనవరి 4న రాజపేట మండలం పాముకుంట సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా (ఔట్‌సోర్సింగ్) విధుల్లో చేరారు. విధి నిర్వహణలో ఆయన కనబరిచిన అంకితభావం అధికారుల మన్ననలు పొందింది. 2017లో ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టిజన్లుగా గుర్తించింది. తనతో పాటు పనిచేస్తున్న తోటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2016లో ఐఎన్‌టీయూసీ-327 యూనియన్‌లో చేరిన ఆయన.. అప్పటి నుంచి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు. మొదట ఆలేరు సబ్ డివిజన్ లీడర్‌గా, 2020లో భువనగిరి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, 2025లో యాదాద్రి భువనగిరి జిల్లా ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మెలో మహేష్ కీలక పాత్ర పోషించారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ భువనగిరి డివిజన్ చైర్మన్‌గా వ్యవహరించి, పది రోజుల పాటు సమ్మెను అత్యంత శాంతియుతంగా, విజయవంతంగా నడిపించారు. ఒక సాధారణ దళిత కుటుంబం నుంచి వచ్చి, అటు వృత్తిలోనూ, ఇటు కార్మిక నాయకుడిగానూ ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహేష్‌ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.



# గాన గంధర్వుడు సత్యనారాయణకు సత్కారం

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు చెడదీపు సత్యనారాయణకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో దత్తసేవారథం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ వేదికపై సత్యనారాయణ 'అన్నమయ్య' చిత్రంలోని "విన్నపాలు వినవలె వింత వింతలు" అనే కీర్తనను తన మధుర స్వరంతో ఆలపించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన ప్రతిభను గుర్తించిన సభా నిర్వాహకులు, అతిథులు సత్యనారాయణను శాలువాతో కప్పి, జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి కళాక్షేత్రంలో రాణిస్తుండటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# లోకకల్యాణార్థం.. వీరభద్రుని సేవలో మంత్రి

**తొలివెలుగు, టేక్మాల్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బోడ్మట్ పల్లి గ్రామం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. గ్రామ పరిధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ వేడుకకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, గ్రామస్తులు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు.

అనంతరం మంత్రి స్వామివారి కళ్యాణ క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కార్యక్రమంలో సర్పంచ్ తలారి అవినాష్ కుమార్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారుపల్లి 'ప్రభుత్వ' బడి.. విజయాలకి నిలయం!

**వరుసగా ఎనిమిదోసారి 100% ఉత్తీర్ణత**

**జిల్లాలోనే అత్యధికంగా 4 ఇన్‌స్పైర్ అవార్డులు**

**అదనపు బాధ్యతల్లోనూ అదరగొట్టిన హెచ్ఎం బుస్సా రమేష్ బృందం**



తొలివెలుగు, రాజాపేట: విద్యా కుసుమాలు వికసిస్తున్నాయి.. ప్రభుత్వ పాఠశాల అంటే ఫలితాలు ఇలాగే ఉండాలని పారుపల్లి ఉన్నత పాఠశాల చాటిచెబుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ, ఎంఈఓ చందా రమేష్ పర్యవేక్షణలో ఈ పాఠశాల ఆదర్శంగా నిలిచింది. 2018-19 విద్యా సంవత్సరం నుండి ఇప్పటివరకు వరుసగా 8 సార్లు పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించింది.తాజా ఫలితాల్లోనూ 13 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలవగా, వైష్ణవి 522 మార్కులతో టాపర్‌గా నిలిచింది. నలుగురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. కేవలం చదువులోనే కాకుండా, సైన్స్ రంగంలోనూ సత్తా చాటుతూ జిల్లాలోనే అత్యధికంగా 4 ఇన్‌స్పైర్ అవార్డులను కైవసం చేసుకుంది. పూర్తిస్థాయి ప్రధానోపాధ్యాయుని పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ, ఎఫ్ఏసీ హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న బుస్సా రమేష్ తన ఉపాధ్యాయ బృందాన్ని సమన్వయం చేసుకుంటూ పాఠశాలను అగ్రపథంలో నిలిపారు.

## హనుమాన్ భక్తులకు సామూహిక భిక్ష

**ఏర్పాట్లు చేసిన మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్**

తొలివెలుగు, రాజాపేట: మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఈనెల 5వ తేదీ (మంగళవారం) హనుమాన్ మాలధారణ భక్తులకు సామూహిక అన్న ప్రసాద వితరణ (భిక్ష) కార్యక్రమం నిర్వహించనున్నారు. మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, సంధిల రాంచందర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు హనుమాన్ స్వామి వారికి ప్రత్యేక భజనలు, భక్తి గీతాల ఆలపన ఉంటుంది. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు భిక్షా కార్యక్రమం ప్రారంభిస్తారు.ఆలయ శాశ్వత అధ్యక్షుడు నంగునూరి చంద్రశేఖర్, ఆలయ అభివృద్ధి కమిటీ, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు.

## రాకపోకలకు 'బ్రేక్'..

### 45 రోజులుగా అధికారుల నిర్లక్ష్యం

**కాల్వపల్లి - పొట్టిమర్రి మధ్య తెగిన డైవర్షన్ రోడ్డు**

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఐబీ, ఆర్ అండ్ బీ శాఖలు**

**90 శాతం రాకపోకలు బంద్.. రద్దయిన బస్సులు**

**ఆందోళనల బాటలో విపక్షాలు.. తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్**



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల పరిధిలో అధికారుల అనాలోచిత నిర్ణయాలు, సమన్వయ లోపం కారణంగా సామాన్య ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతోంది. మండలంలోని కాల్వపల్లి - పొట్టిమర్రి గ్రామాల మధ్య ఉన్న వాగుపై రాకపోకల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు తెగిపోయి 45 రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు ఇసుమంతైనా స్పందించడం లేదు. జిల్లా నలుమూలల నుంచి రాజాపేట మండల కేంద్రానికి చేరుకునే ప్రధాన మార్గం ఇదే కావడంతో, రోడ్డు తెగిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అనాలోచిత నిర్ణయమే శాపంగా..తుంగతుర్తి నియోజకవర్గానికి కాళేశ్వరం జలాలను తరలించే క్రమంలో అధికారులు ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా నీటిని వాగులోకి విడుదల చేశారు. నీటి ఉధృతికి కాల్వపల్లి - పొట్టిమర్రి వాగు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు (డైవర్షన్) పూర్తిగా కోతకు గురై కొట్టుకుపోయింది. దీంతో రాజాపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే దాదాపు 90 శాతం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలు ఇతర మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకునేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారు.

**చలించని యంత్రాంగం.. కదం తొక్కిన విపక్షాలు**

సమస్య ఉత్పన్నమై నెలన్నర రోజులు గడుస్తున్నా ఐబీ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. కేవలం కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల తీరుపై బీజేపీ, బీఆర్ఎస్ (టీఆర్ఎస్), సీపీఐ సహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. వాగు వద్ద నిరసనలు తెలపడంతో పాటు, విలేకరుల సమావేశాలు నిర్వహించి, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం శూన్యంగా మారింది. పరిస్థితి మరింత విషమించక ముందే యంత్రాంగం మేల్కొనాలని, తక్షణమే డైవర్షన్ రోడ్డును పునరుద్ధరించి రాకపోకలను సాఫీగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో విపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని, తదనంతర పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.





# భక్తిశ్రద్ధలతో వీరభద్రుడి కళ్యాణం

**దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

**తొలివెలుగు, టేక్మాల్:** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లిలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన స్వామివారి కళ్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులందరికీ స్వామివారి కృపాకటాక్షాలు కలగాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టేక్మాల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ వారు చేసిన ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.



## పేదల సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇళ్లతోనే సాధ్యం!



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** సామాన్యుడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారమవుతుందని పురపాలక చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో గుండేటి రాజు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని 13వ వార్డు కౌన్సిలర్ సూరపల్లి రాధికా రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.కౌన్సిలర్ సూరపల్లి రాధికా రమేష్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంతోనే పేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. అనంతరం నూతన ఇంటి లబ్ధిదారులకు తన వ్యక్తిగత పక్షాన పట్టుచీర, జ్యోతి కానుకను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపాముల నాగేష్, రుద్ర చంద్రప్రకాష్, తాటిపాముల మహేందర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వేసవి విజ్ఞాన విందు!

### శోభనాద్రిపురంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

### పిల్లల శారీరక, మానసిక వికాసమే ధ్యేయం

### 40 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ



**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శోభనాద్రిపురం గ్రామంలో వేసవి శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (ఎంపీయూపీఎస్), ఫూలే స్టడీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ నిర్వాహకులు ఎర్ర నరేష్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ 40 రోజుల పాటు ఈ బ్రిడ్జ్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కరాటే, డాన్స్, కోలాటం వంటి శారీరక శిక్షణతో పాటు గణితం, తెలుగు, స్పోకెన్ ఇంగ్లీష్‌లలో మౌలిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. అలాగే చెస్, వాలీబాల్ వంటి క్రీడలు, పెయింటింగ్, ఒరిగామి వంటి సృజనాత్మక అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థుల గొంతు కోస్తున్న రేవంత్ సర్కార్!

**జీవో 7ను వెంటనే రద్దు చేయాలి**

**నకిరేకల్ బి.ఆర్.ఎస్.వి నాయకుడు శివ ప్రసాద్ యాదవ్ డిమాండ్**



**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 7 పేద విద్యార్థుల పాలిట డెత్ వారెంట్‌గా మారిందని బి.ఆర్.ఎస్.వి నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జెట్టి శివ ప్రసాద్ యాదవ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ముందుగా ఫీజు చెల్లిస్తే, ఆ తర్వాత రీయింబర్స్‌మెంట్ వేస్తామనడం హాస్యాస్పదమని, రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాల విద్యార్థులు వేల రూపాయలు ఎక్కడి నుంచి తెస్తారని ఆయన ప్రశ్నించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లోనే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని క్రమంగా ఎత్తేయడానికే ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెబుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 7ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.